క్లుప్తంగా

120 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవరచుకోవాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు కోరారు. మూలపేటకు చెందిన స్వర్గీయ మొల్లేటి శంకర్ గణేష్ జ్ఞాపకార్థంగా అతడి తల్లిదండ్రులు పరమేశ్వరరావు, మాణిక్యం దంపతుల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన దుప్పట్లను 120 మంది పేదలకు శుక్రవారం రాత్రి పంపిణీ చేశారు. గంగప్పలనాయుడు మాట్లాడుతూ చిన్నవయస్సులో గణేష్ మృతి చెందడం బాధాకరమన్నారు. అతని పేరిట ఆర్బీతోపాటు అనకాపల్లి నుంచి మూలపేటకు వచ్చే దారిలో 15 వీధి దీపాల ఏర్పాటుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సులభంగా కేసుల పరిష్కారం



యలమంచిలి కోర్టులో కక్షిదారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను సులభంగా పరిష్కరించుకునేందుకు కక్షిదారులకు మంచి అవకాశం ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ అన్నారు. శనివారం స్థానిక న్యాయస్థానాల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 706 కేసులు పరిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పరిష్కరించుకోగలిగిన కొన్ని కేసుల కోసం కక్షిదారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా సులభంగా రాజీ చేసుకోవచ్చన్నారు. రాజీమార్గం రాజమర్గంగా గుర్తించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. స్వాతిభవానీ, అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ టి. వీరరాఘవేంద్రరావు, లోక్ అదాలత్ సభ్యులు డి. వెంకట్రావు, పి.వి. రమణ, పలువురు పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఉత్తమ రైతుకు సన్మానం



ఉత్తమ రైతును సత్కరిస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ, ఏడీఏ టి.శ్రీదేవి

నర్సీపట్నం : వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం, నూతన వరి వంగడాలను సాగుచేయడం, పొలంబడిలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో నర్సీపట్నం మండలం, ధర్మసాగరంకు చెందిన సుకల అప్పలనాయుడు ఉత్తమ రైతుగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. అనకాపల్లిలో నిర్వహించిన కిసాన్ మేళాలో అప్పల నాయుడకు ఉత్తమ రైతు అవార్డు ప్రకటించారు. అనివార్య కారణాల వల్ల ఆయన వెళ్లకపోవడంతో శనివారం వ్యవసాయ ఏడీఏ టి.శ్రీదేవి స్వగ్రామం వెళ్లి జెడ్పీటీసీ సుకల రమణమ్మ చేతుల మీదుగా అవార్డు అందజేసి, శాలువాతో సత్కరించారు.

శీతాకాలం వ్యాధులపై అవగాహన



వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి: మండలంలోని వెంకుపాలెం వృద్ధాశ్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు సంస్థ చైర్మన్, వైద్యుడు జి.రామ్మూర్తి ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం సూర్యోదయంలో గంట పాటు ఎండ తగిలే లా చూసుకోవాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఉచితంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ హిమజా కిరణ్, సభ్యులు వెంకట రమణ, కన్నేశ్వరరావు, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంతా ప్రశాంతం

- సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ
- పోటీ లేకుండా కూటమి కుయుక్తులు
- సుంకపూరు ఎన్నిక వాయిదా..



కె.వెంకటాపురంలో చైర్మన్‌గా ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న చంటి



నీటి సంఘ ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలిచిన చైర్మన్లు



ఉద్దండపురం పూర చెరువు చైర్మన్‌గా ఎన్నికైన సూరిబాబును అభినందిస్తున్న నాయకులు



బాపిరాజు చెరువు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో నాయకులు

కోటవురట్ల: అప్రజాస్వామికంగా జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బహిష్కరించినట్టు మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. అయితే అధికారులు 36 మేజర్, 42 మైనర్ చానళ్లకు ఎన్నికల ప్రక్రియను శనివారం నిర్వహించారు. కైలాసపట్నంలో గోవాడ గెడ్డ చానల్‌కు నిర్వహించిన ఎన్నికలో దంటు వేణు వెంకటేశ్వరరావు చైర్మన్‌గా, మేడిశెట్టి నానాజీ, మేకల సీతారామరాజు, చామంతుల చంటిబాబు డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీవోగా వ్యవహరించిన బి.సరోజిని ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రైతు నాయకుడు డీవీ సూర్యనారాయణరాజు చైర్మన్, డైరెక్టర్లను అభినందించారు. ఎంపీటీసీ ఎస్.రమణ, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు. కె.వెంకటాపురంలో కోదండరామ చెరువు ప్యానల్‌కు నిర్వహించిన ఎన్నికలో రైతు మల్లాది రామజోగేశ్వర గోవిందు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రైతు నాయకుడు పైల నాని, గొల్లు చిట్టిబాబు తదితరులు అభినందించారు. దుగ్గాడ చానల్‌కు సంబంధించి వేములపూడి, అన్నవరం, బి.కె.పల్లి, తంగేడు, జల్లూరు సిగ్మెంట్లలో చైర్మన్లు, డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టీడీపీ రెబల్ అభ్యర్థి నామినేషన్ చించివేత..

సుంకపూరు సిగ్మెంట్‌లో ఎన్నిక ప్రక్రియ వివాదాస్పదమైంది. టీడీపీ రెబల్ అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని ఆ పార్టీ నాయకులు చించివేయడంతో వాతావరణం వేడెక్కింది. వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఎన్నిక ప్రక్రియను వాయిదా వేసినట్టు అధికారులు ప్రకటించారు. ఎన్నిక ప్రక్రియను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జనసేన, టీడీపీ రెబల్ నాయకులు డిమాండ్ చేస్తూ కొంత సేపు ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ రమేష్ సర్దిచెప్పి పంపించివేశారు.

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో మూడు చెరువులకు శనివారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో పాలెపు చెరువు చైర్మన్‌గా వెలగా నారాయణరావు, వైస్ చైర్మన్‌గా మాకిరెడ్డి అప్పన్న, కసుముల చెరువు చైర్మన్‌గా కొప్పిసెట్టి పకీరు, వైస్ చైర్మన్‌గా పాలూరి కమల, పరగణం చెరువుకు చైర్మన్‌గా తూము చెల్లయ్య, వైస్ చైర్మన్‌గా తూము రాము ఎన్నికయ్యారు. జగన్నాథపురం చీడిక రిజర్వాయర్ చైర్మన్‌గా నానేపల్లి రాఘవ, వైస్ చైర్మన్‌గా గొల్లపల్లి సూర్యారావు, జగన్నాథపురం పెద్దచెరువు వైస్ చైర్మన్‌గా కరణం ఈశ్వరరావు, డైరెక్టరుగా నారపురెడ్డి కుమారి, నెల్లిపూడి పూర చెరువు వైస్ చైర్మన్‌గా అయినంపూడి సురేష్ గెలిచారు.

ఎస్.రాయవరం: మండలంలో నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దదారులు ఏకగ్రీవమయ్యారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఈ ఎన్నికలకు దూరంగా ఉండటంతో వారు ఎన్నికయ్యారు. దీంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

పాయకరావుపేట: మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినవి. మండలంలో 7 సాగునీటి చానళ్లకు నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్లు ఏకగ్రీవమైనట్లు నీటి పారుదల శాఖ ఏఈ కె.శ్రీరామమూర్తి తెలిపారు. భూమి చానల్ చైర్మన్‌గా గెద్దం చలపతిరావు, వైస్ చైర్మన్‌గా పైలా నూకినాయుడు, ఆవ కాలువ చైర్మన్‌గా గణపర్తి చంద్ర నరసింగరావు, వైస్ చైర్మన్‌గా ప్రగడ అప్పారావు, ముఠా కాలువ చైర్మన్‌గా చెంచలపు రామారావు, వైస్ చైర్మన్‌గా కాశపు రామకృష్ణ, మంగవరం కాలువ చైర్మన్‌గా గూటూరు రామగోవిందు, వైస్ చైర్మన్‌గా సుంకర అప్పారావు, రాజవరం కాలువ చైర్మన్‌గా పెరుమళ్ల గోవిందరావు, వైస్ చైర్మన్‌గా కుండల నాగరాజు, మాసాహేబుపేట కాలువ చైర్మన్‌గా నారపురెడ్డి జోగిరాజు, వైస్ చైర్మన్‌గా కీర్తి సీతారాం, కసుమల చెరువు చైర్మన్‌గా గణసాల గంగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా బుద్దాల వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అచ్యుతాపురం: మండలంలోని నాలుగు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా శనివారం జరిగాయి. పురిటిగెడ్డ కాలువ(పెదపాడు) నీటి సంఘం అధ్యక్షునిగా జనపరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా కర్రి నాగేశ్వరరావు, సభ్యులుగా శరగడం ఆదిబాబు, జనపరెడ్డి రమణ, తాడి చినబాబు, తాడి అప్పారావు ఎన్నికయ్యారు. మెలిపాక గెడ్డ సిస్టం(మెలిపాక) నీటి సంఘం అధ్యక్షునిగా వీసం సత్యారావు, ఉపాధ్యక్షునిగా మళ్ల భాస్కర్‌రావు, సభ్యులుగా చందక నూకరాజు, ముత్యాల కాసుబాబు, భీమిని ఆదినారాయణ, ఉల్లింగల శ్రీను, కొండకర్ల ఆవ నీటి సంఘం అధ్యక్షునిగా కాండ్రేగుల జోగినాయుడు, ఉపాధ్యక్షునిగా కట్టమూరి బాబూరావు, సభ్యులుగా శరగడం రమణబాబు, జనపరెడ్డి కృష్ణారావు, గంగిరెడ్ల అప్పలరాజు, పాలమరశెట్టి నాయుడు, గొరికివానిగెడ్డ సిస్టం(ఉప్పవరం) నీటి సంఘం అధ్యక్షునిగా గుదేల కనకరావు, ఉపాధ్యక్షునిగా కాయల వసంతరావు, సభ్యులుగా చిన్ని శ్రీనివాసరావు, కొల్లాటి నాగేశ్వరరావు, గీసాల చిన అప్పారావు, శిష్టి వెంకటరమణ ఎన్నికయినట్లు అధికారులు తెలిపారు.

సాగునీటి ఎన్నికల వేళ కానరాని వీఆర్వోలు

ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో రైతుల గుర్రు



మునగపాక తహసీల్దార్ కార్యాలయం

మునగపాక: ఒకవైపు సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ జరుగుతుంటే, అందుబాటులో ఉండాల్సిన వీఆర్వోలు స్పందించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది వీఆర్వోలు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడం పట్ల రైతులు ఆందోళనకు గురయ్యారు. పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా నీటి తీరువా పన్ను చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించినట్లు వీఆర్వో ధ్రువీకరిస్తేనే నామినేషన్ దాఖలు చేయాలన్న నిబంధన ఉంది. దాంతో రెవెన్యూ కార్యాలయం చుట్టూ ఎన్నిక రోజున తిరగాల్సి రావడంతో అధికారుల తీరుపై పలువురు రైతులు ఆగ్రహించారు. సచివాలయం లేదా రెవెన్యూ కార్యాలయం వద్ద అందుబాటులో ఉండాలి. అయితే తోటాడ, అరబుపాలెం తదితర వీఆర్వోలు అందుబాటులో లేరని రెండు రోజులుగా ఫోన్ చేస్తున్నా స్పందించడం లేదని వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పట్టనట్లు వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆవ కాలువ ఎన్నికల్లో టీడీపీ నేతల వర్గ పోరు

- చైర్మన్ పదవి కోసం విభేదాలు
- అధికారుల రంగ ప్రవేశంతో సమస్య పరిష్కారం



ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు డైరెక్టర్లు



ఎన్నిక నిబంధన మేర నిర్వహించలేదంటూ అధికారులతో వాగ్వాదం చేస్తున్న తమ్ముళ్లు

మునగపాక: మండల వ్యాప్తంగా సాగునీటి కాలువ సంఘ ఎన్నికలు ప్రశాంతంగా జరగ్గా, మునగపాక జెడ్పీ హైస్కూల్‌లో ఆవ కాలువ సంఘ ఎన్నిక మాత్రం చివరి వరకు ఉత్కంఠ సాగింది. ఈ ఎన్నిక కొంతసేపు గందరగోళానికి తెర తీసింది. ఆవ కాలువకు సంబంధించి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అనుచరులుగా చెలామణి అవుతున్న దాడి శివ లేదా తమలో ఎవరికైనా చైర్మన్ పదవి కావాలంటూ పట్టుబట్టారు. ఇదే సమయంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు తన వర్గీయులైన మూలపేటకు చెందిన పార్టీ నేత నాయుడుకు చైర్మన్ పదవి దక్కాలంటూ ప్రయత్నాలు చేశారు. ఇరు వర్గాల నేతలు ఎవరికి వారే ప్రతిష్టాత్మకంగా ఎన్నికను తీసుకున్నారు. చివరకు శ్రీనివాసరావు అనుచరునికే ఆవ కాలువ చైర్మన్ పదవి వరించడంతో నాగేశ్వరరావు అనుచరులు మిన్నకుండిపోవాల్సి వచ్చింది. అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో తమకు అవకాశం లేకుండా పోయిందని శివ వాపోయారు. కొంతమంది రైతులు తమకు ఓటు వేసే అవకాశం కల్పించాలంటూ పోలింగ్ కేంద్రం వద్ద కొంతసేపు హడావుడి చేయడంతో విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పి.ప్రసాదరావు రంగ ప్రవేశం చేసి నీటిపారుదల శాఖ ఏఈ వినయ్‌తో చర్చించి సమస్య సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ఎ.కోడూరులో నిరసన కార్యక్రమాన్ని చేస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఎ.కోడూరులో శనివారం విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ముత్యాలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలపై రూ.200 కోట్ల భారం ప్రజలపై మోపినట్టు ఆరోపించారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచమంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాట తప్పాడని సీపీఎం నాయకుడు వనుము సూర్యనారాయణ అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం ప్రజలను మోసగించినట్లేనని ఆయన విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ పోతున్నా వాటిని అదుపు చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని చంద్రబాబు ప్రభుత్వం వెనక్కి తీసుకోనకపోతే సీపీఎం తరపున ఉద్యమం నిర్వహిస్తామని అన్నారు. నిరసనలో యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు

కూలీలకు పెరిగిన డిమాండ్



పండిన వరి పంట



పనలుగా ఉంచిన వరి పంట



వరి పంటను కుప్పలుగా వేస్తున్న రైతులు, కూలీలు



పండిన వరి కోస్తున్న కూలీలు

పాయకరావుపేట: మండలంలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. అరట్లకోట, గుంటపల్లి, మంగవరం, నామవరం, సీతారాంపురం, గోపాలపట్నం, పెంటకోట, పాల్తేరు, కుమారపురం, రాజగోపాలపురం, శ్రీరాంపురం, కేశవరం, ఎస్.నర్సాపురం, పెదరాంభద్రపురం తదితర గ్రామాల్లో వరి పంట పండింది. వర్షాలు సకాలంలో కురవడం, తాండవ నుంచి సాగునీరు సక్రమంగా సరఫరా కావడంతో వరి పంట చేతికంది వచ్చింది. పలు గ్రామాల్లో వరి కోతలు, కుప్పలు పనులు ముమ్మరంగా సాగడంతో కూలీలకు చేతి నిండుగా పని దొరికింది. స్త్రీ, పురుష కూలీలకు పనులు చురుగ్గా సాగుతున్నవి. మండలంలోని 24 గ్రామాల్లో 7,500 ఎకరాల్లో రైతులు వరి పంటను పండించారు. పండిన వరి పంటను కోసిన తర్వాత పనలపై నాలుగు రోజుల పాటు ఉంచి, అనంతరం పచ్చి ఆరిన తర్వాత కుప్పలు వేస్తున్నారు. ప్రస్తుతం వరి పంటను రైతులు కుప్పలుగా వేసి నిల్వ ఉంచి జనవరిలో సంక్రాంతి ముందు, తర్వాత కూడా ధాన్యం నూర్పులు చేపడతారు. వరి పంట పండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య వాతావరణ హెచ్చరికలకు రైతులు కొంత ఆందోళన చెందినప్పటికీ తుఫాన్ గండం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. వరి పంట కోతలు, కుప్పలు పెట్టడం పనిలో నిమగ్నమయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు



సామూహికంగా సీమంతాలు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామానికి చెందిన పాలకుర్తి మోహన్‌రావు భార్య కుసుమ జ్ఞాపకార్థం 2 వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. విశాఖ నరసింహనగర్ 2 వార్డు వెల్ఫేర్ అభివృద్ధి కార్యదర్శి గూనిపూడి నాగేశ్వరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు పఠాన్ షీయాజ్ ఖాన్, మధుసూదన్‌రావు

నర్సీపట్నం : రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ఇరువర్గాలకు మేలు చేకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం కోర్టు అవరణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టులు చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా కాకుండా రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు అత్యున్నత న్యాయ స్థానం చక్కటి అవకాశాన్ని కల్పించిందన్నారు. అదాలత్‌లో పరిష్కరింపబడిన కేసుల్లో అపీలుకు వెళ్లే అవకాశం లేదన్నారు. ఇరు వర్గాలు రాజీపద్ధతిలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఎవరికీ అన్యాయం జరగదన్నారు. అనంతరం కక్షిదారుల సమ్మతితో కేసులను పరిష్కరించారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు



నాగులాపల్లిలో సారెతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గోవిందసత్యనారాయణ

మునగపాక: నాగులాపల్లిలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. సాయంత్రం గ్రామంలో సారె ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో అన్ని వీధుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని పూజలు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల మంజూరు

సాక్షి ఎఫెక్ట్..



తోటాడ త్రిమూర్తుల ఆలయం నుంచి నాగులాపల్లికి వెళ్లే రోడ్డుకు కొలతలు సేకరిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయం నుంచి నాగులాపల్లి వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. రెండు గ్రామాలతో పాటు పలు గ్రామాలకు అనువుగా ఉండేలా గతంలో విశాఖ డెయిరీ ద్వారా రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి గ్రావెల్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుపై వర్షాకాలంలో పయనించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 10వ తేదీన రోడ్డు ఘోరం -ఒళ్లు హూనం వార్తకు స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే విజయకుమార్ దృష్టికి తీసుకురావడంతో సీసీరోడ్డు నిర్మించేందుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు కొలతల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాము కొలతలు తీశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు, కూటమి నేతలు పాలమరశెట్టి మురళి, పాలమరశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యంత్రంతో వరి కోతలు



కొత్తపోలవరంలో యంత్రంతో వరి కోతలు

ఎస్.రాయవరం: మండలంలో వరి కోతలకు రైతులు నూతన ప్రయోగం ఎత్తుకున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు మాదిరిగా ఎస్.రాయవరం మండలంలోనూ యంత్రంతో కోతలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే అడపాదడపా కోతలు ప్రారంభమైనప్పటికీ తుఫాన్ హెచ్చరికలు కారణంగా ఇప్పటికే పలు మార్లు వాయిదాలు వేసుకున్నారు. ఇప్పుడు వీలైనంత త్వరగా కోతలు పూర్తి చేసుకోవాలన్న ఆందోళనలో పడ్డారు. ఈ మేరకు కొత్తపోలవరం, గుడివాడ ప్రాంతాల్లో యంత్రం ఉపయోగించి కోతలు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో ముమ్మరంగా రబీ వరి నాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు తాండవ ప్రాజెక్టు నీరు నిలుపుదల



తాండవ రిజర్వాయరు

నాతవరం : తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీటిని ఆదివారం ఉదయం నుంచి నిలుపుదల చేస్తున్నామని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు.ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టు భూములకు ఆగష్టు 19వ తేదీన నీరు విడుదల చేసామన్నారు. వరి పంట పండేయడంతో రైతులు అభీష్టం మేరకు నేటి నుంచి తాండవ ప్రాజెక్టు నుంచి నీరు నిలుపుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో 369.0 అడుగులు నీటి మట్టం ఉందన్నారు. ప్రమాద స్థాయి నీటి మట్టం 380.0 అడుగులు కాగా డేడ్ స్టోరేజీ నీటి మట్టం 344.0 అడుగులు నీటి మట్టంగా పరిగణిస్తామన్నారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 52వేల ఎకరాలు ఆయకట్టుకు నీటి నిష్పుష్కలంగా సరఫరా చేసామని డీఈ అనురాధ తెలిపారు.